సాక్షి
కర్నూలు
మంగళవారం । 24 । జనవరి । 2023



బంగారు కమండలం సమర్పణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి సోమవారం సికింద్రాబాద్‌కు చెందిన రాహుల్, జయలక్ష్మి దంపతులు 570 గ్రాముల బంగారు కమండలాన్ని సమర్పించారు.



శనగ కోతలు షురూ

దొర్నిపాడు: జిల్లాలో శనగ పంట కోతలు ప్రారంభమయ్యాయి. యంత్రాలు అందుబాటులో ఉండటంతో ఓ వైపు కోతలు, మరో వైపు పంట నూర్పిడి సులువుగా మారింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,618.74
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:57.866
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,738

న్యూస్‌రీల్

ఉపాధి పనులకు పెరిగిన కూలీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెరుగుతోంది. గత వారం 31,338 మంది హాజరుకాగా, సోమవారం ఈ సంఖ్య 52,697కి పెరిగింది. తుగ్గలి, ఓర్వకల్లు, వెల్దుర్తి, కోసిగి, పత్తికొండ, కొతాళం, కృష్ణగిరి, కల్లూరు, హాలహర్వి, హొళగుంద, గూడూరు మండలాల్లో కూలీల సంఖ్య పెరిగింది. తుగ్గలి మండలంలో అత్యధికంగా 4,738 మంది ఉపాధి పనులకు రిపోర్టు చేసుకున్నారు.

30లోపు ప్రాజెక్టులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి

కర్నూలు సిటీ: ఇన్‌స్పైర్ మనాక్ 2021–22 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల(255ప్రాజెక్టులు)ను ఈ నెల 30వ తేదీలోపు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టుల ఫొటోలు, వీడియోలు, ఆడియోలు నిర్దేశించిన నమూనాలో ఉండాలన్నారు. వీడియో 30 ఎంబీలోపు ఉండాలని, ఆడియో క్లిప్‌లకు పరిమితం లేదని, పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ రంగమ్మ(8790111331)ను సంప్రదించాలన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ బ్యానర్ల నిషేధం


కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఈ నెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ బ్యానర్లపై నిషేధం అమల్లోకి రానున్నదని కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పోస్టర్లను అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యానర్లను వినియోగిస్తే ఒక చదరపు అడుగుకు రూ.100 జరిమానాతోపాటు 1986 చట్టం ప్రకారం శిక్ష పడుతుందన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్లను ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. సమాజంలో బలబాలికలు ఇద్దరూ సమానమేనన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్, కర్నూలు నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రామలింగేశ్వరుడు, ఐసీడీఎస్ పీడీ కుమారి పాల్గొన్నారు.

ఆరు మండలాలకు ప్రత్యేకాధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ఆరు మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ పి.కోటేశ్వరరావు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కొతాళం మండలానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి, కోసిగికి జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, మంత్రాలయానికి డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, పెద్దకడుబూరుకు డీపీఓ నాగరాజు నాయుడు, ఆదోనికి ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆస్పరికి పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్‌లను నియమించారు. వీరు మంగళవారం నుంచే ఆయా మండలాల్లోని వలసలు ఎక్కువగా ఉన్న గ్రామాలకు వెళ్లి సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు. బుధవారం సాయంత్రం లోగా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- ఉమ్మడి జిల్లాలో ఐదు కేంద్రాల ఏర్పాటు



కర్నూలు(సిటీ): జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో కేవీ సుబ్బారెడ్డి, బిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలు, కర్నూలులోని నంద్యాల చెక్ పోస్టు వద్ద ఉన్న డిజిటల్ ఐకాన్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే నంద్యాల జిల్లాలో ఆర్‌జీఎం, ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. బీఈ, బీటెక్ విభాగాల్లో మంగళవారం, ఈనెల 25, 29, 30, 31, ఫిబ్రవరి 1వ తేదీలలో రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఆదే విధంగా 28వ తేదీన బీఆర్క్, బి ప్లానింగ్ విభాగాల్లో మధ్యాహ్నం షిఫ్టులో పరీక్ష జరగనుంది. విద్యార్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఫొటోతో కూడిన గుర్తింపు కార్డులను వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. బాల్ పాయింట్ పెన్నుతోపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినప్పుడు అప్‌లోడ్ చేసిన ఫొటోను ప్రింట్ తీసుకుని పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాలి. దివ్యాంగులైన విద్యార్థులు మెడికల్ ఆఫీసర్ ధ్రువీకరించిన సర్టిఫికెట్‌ను వెంట తీసుకెళ్లాలి. పరీక్ష కేంద్రాల్లోకి గంట ముందు నుంచే విద్యార్థులను అనుమతించనున్నారు.

☛ ఇది 'ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ పవర్‌ప్లాంటు' (ఏకీకృత పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు). ఓర్వకల్లు మండలంలోని పిన్నాపురంలో రూ.15వేల కోట్లతో 'గ్రీన్‌కో' కంపెనీ నిర్మిస్తోంది. ఇప్పటికే 40శాతం పనులు పూర్తయ్యాయి. ప్లాంటు నిర్మాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల ఉద్యోగాలు రానున్నాయి. 75శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలనే చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావడంతో 17,250 ఉద్యోగాలు స్థానికులకే దక్కుతాయి.





☛ కొలిమిగుండ్ల మండలంలో 7,100 ఎకరాల భూమిలో రామ్‌కో సిమెంట్ నిర్మించారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్లాంటును ప్రారంభించారు. రూ.1,790కోట్లతో నిర్మించిన ఈ ప్లాంటు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,500 ఉద్యోగాలు రానున్నాయి. ఇందులో 1,125 ఉద్యోగాలు స్థానికులకే దక్కనున్నాయి. రెండోప్లాంటు పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి.

☛ ఇక్కడ నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు జయరాజ్ ఇస్పాత్. తొలి విడతలో 413.19 ఎకరాల్లో రూ.2,938కోట్లతో ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. 1,060 ఉద్యోగ అవకాశాలు ఉండగా.. స్థానికులకు 795 ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఫేజ్–2లో మరో 600 ఎకరాలు ఏపీఐఐసీ కేటాయించింది.



.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ఇవి మచ్చుతునకలు. అపార ఖనిజ సంపద, భూమి, నీరు, రోడ్, ఎయిర్ కనెక్టివిటీ ఉండటంతో పారిశ్రామికవేత్తల దృష్టి ఈ ప్రాంతంపై పడింది. 21 ప్రధాన కంపెనీలు ఇక్కడ పరిశ్రమల స్థాపనకు భూముల కోసం ఏపీఐఐసీకి దరఖాస్తు చేసుకోవడం చూస్తే ప్రభుత్వం ఏ స్థాయిలో పరిశ్రమలను ప్రోత్సహిస్తుందో అర్థమవుతుంది.



పారిశ్రామిక వెలుగులు.. ఉపాధి గుళికలు!



సాక్షి ప్రతినిధి కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వం ఆరు ఇండస్ట్రియల్ పార్క్‌లను అభివృద్ధి చేస్తోంది. కర్నూలు, ఆదోని, డోన్‌తో పాటు నంద్యాలలో రెండు పార్కులు ఉన్నాయి. కర్నూలు పరిధిలో ఓహెచ్‌ఎం(ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్) కోసం 11 గ్రామాల పరిధిలో 10,900 ఎకరాలను ఏపీఐఐసీ సేకరించింది. ఇందులో 8,300 ఎకరాలు పట్టా, తక్కినవి డీకేటీ భూములు. హైదరాబాద్–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా 'ఓహెచ్‌ఎం'ను 'నోడ్ పాయింట్'గా కేంద్ర ప్రభుత్వం 2020 ఆగస్టులో నోటిఫై చేసింది. ఇందులో ఇప్పటికే జయరాజ్ ఇస్పాత్ స్టీల్‌ప్లాంటు పనులు జరుగుతున్నాయి. అలాగే తంగడంచలో జైన్ ఇరిగేషన్‌కు 623.40 ఎకరాలు కేటాయించారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ పార్క్ ఇక్కడ ఏర్పాటవుతోంది.

భూముల కోసం 21 కంపెనీల దరఖాస్తు

ఓహెచ్‌ఎంలోని గుట్టపాడు క్లస్టర్‌లో 4,900 ఎకరాలు ఏపీఐఐసీ సేకరించింది. ఇందులో సిగాచీ ఇండస్ట్రీస్, ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్, మారుతి–సుజుకి లాంటి ప్రధాన సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. మారుతి–సుజుకి ఫార్మారంగంలో ప్రవేశిస్తోంది. దీంతో పాటు మరో 5 ఫార్మాకంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. అలాగే ప్రైమోపాలీ ప్యాక్(ప్లాస్టిక్ ఇండస్ట్రీ), బ్లాక్‌హ్యాక్, ఎక్సెల్ ఇమ్యూన్ లాజిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్(వెటర్నరీ ఫార్మా) లాంటి మరో 13 బడా కంపెనీలు కూడా గుట్టపాడు క్లస్టర్‌లో నిర్మాణాలు మొదలుపెట్టబోతున్నాయి.

'ఇండస్ట్రియల్ హబ్'గా కర్నూలు

- 10,900 ఎకరాలు సేకరించిన ఏపీఐఐసీ
- రూ.800కోట్లతో నీటి వసతి
- సిగాచీ, ఆర్‌పీఎస్‌తో పాటు 8 ఫార్మా రంగ కంపెనీల దరఖాస్తు
- ఫార్మా రంగానికి అనుకూలంగా జిల్లా వాతావరణం
- ప్రభుత్వ జీఓతో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు

ఫార్మా రంగం అభివృద్ధికి అవకాశాలు ఎక్కువ

తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, వైజాగ్ ఫార్మారంగానికి అనువైన వాతావరణం ఉన్న ప్రదేశాలు. హైదరాబాద్ కంటే కర్నూలులోని వాతావరణ పరిస్థితులు ఫార్మా అభివృద్ధికి అత్యంత అనుకూలమని నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో భూసమస్య ఎక్కువగా ఉండటం, అక్కడి కంటే ఇక్కడ అనువైన పరిస్థితులు ఉండటంతో తెలంగాణలో ఏర్పాటు చేయాలనుకున్న ఫార్మాకంపెనీలు కర్నూలుపై దృష్టి సారిస్తున్నాయి. ఓర్వకల్లులో ఎయిర్‌పోర్టు ఉండటం, హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటంతో ఇక్కడ ఫార్మా కంపెనీలు స్థాపించేందుకు సిద్ధమయ్యారు.

'రెడ్' క్లియరెన్స్ వస్తే తరలిరానున్న పరిశ్రమలు



ఫార్మాలో ఆరెంజ్, రెడ్ అని రెండు విభాగాలుగా అనుమతులు ఇస్తారు. ఆరెంజ్ విభాగానికి ఇప్పటికే ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. ఈ విభాగంలో 4,200 ఎకరాల భూములను కేటాయించారు. 'రెడ్'కు సంబంధించి ప్రజాభిప్రాయసేకరణ పూర్తయింది. ఈఐఏ(ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్) రిపోర్ట్‌ను కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఉన్నతస్థాయి కమిటీ దీనిపై నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఆ తర్వాత ఫార్మారంగంలోని పరిశ్రమలు భారీగా తరలివచ్చి కర్నూలుకు 'ఫార్మాహబ్'గా మారనుంది. ఇందుకోసం తొలివిడతలో 900 ఎకరాల్లో ప్రత్యేక బ్లాక్‌ను ఉంచారు.

నీటి వసతి కోసం రూ.288కోట్లతో టెండర్లు పూర్తి

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో నీటిని సరఫరాకు ముచ్చుమర్రి నుంచి 56 కిలోమీటర్ల పైపులైన్ వేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. రూ.288కోట్లకు కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ పనులు దక్కించుకుని పనులు ప్రారంభించింది. రోజూ 74 ఎంఎల్‌డీ నీటిని అందించేలా పైపులైన్ నిర్మిస్తున్నారు. ఫేజ్–2లో మరో రూ.512కోట్లు నీటి సరఫరా కోసం ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయింది. అంతర్గతరోడ్లు, డ్రైనేజీ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి. హైదరాబాద్–బెంగళూరు హైవే నుంచి క్లస్టర్‌లోకి రూ.2కోట్లతో రోడ్డు నిర్మించారు.

'ఫార్మా హబ్'గా కర్నూలు



పరిశ్రమల స్థాపనకు కర్నూలు అత్యంత అనువైన ప్రాంతం. ముఖ్యంగా ఫార్మా రంగానికి అనువైన పరిస్థితులు ఉన్నాయి. 'రెడ్' క్లియరెన్స్ వస్తే ఉమ్మడి జిల్లా ఫార్మాహబ్ అవుతుంది. ఇండస్ట్రియల్ హబ్‌లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పారిశ్రామికంగా కర్నూలు వేగంగా అభివృద్ధి చెందుతోంది.

– విశ్వేశ్వరరావు, జోనల్ మేనజర్, ఏపీఐఐసీ



రామ్‌కో సిమెంటు పరిశ్రమ

సచివాలయాల్లో ప్రతిరోజూ స్పందన

- అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారాలు
- స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. స్పందనలో వచ్చిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా 10.30 గంటల్లోపు హాజరు కావాలన్నారు. తరువాత వచ్చే వారికి నోటీసులు ఇవ్వాలని సంబంధిత విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ వారంలో రెండు అర్జీలు రీఓపెయిన్ అయ్యాయని, ఒక్కటి కూడా రీఓపెయిన్ కాకూడదన్నదే లక్ష్యంగా పనిచేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా సీఎం కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గ్రామ, మండల, జిల్లాస్థాయిల్లో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

స్పందనకు వచ్చిన అర్జీల్లో కొన్ని..

➡ భూమిని తనఖా పెట్టి తీసుకున్న అప్పు తీర్చామని, అయితే భూమి తమదే అంటూ దారం రామలక్ష్మమ్మ, ఆమె భర్త దౌర్జన్యం చేస్తున్నారని ఆస్పరికి చెందిన పింజరి బాబీ ఫిర్యాదు చేశారు.

➡ పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిని తన కూతురు శిరీషకు ఇచ్చానని, అయితే ఆన్‌లైన్‌లో వేరొకరి పేరు నమోదైందని, దానిని తొలగించాలని హాలహర్వికి చెందిన డాక్టర్ శివారెడ్డి అర్జీ ఇచ్చారు.

➡ ఓర్వకల్లు మండలం శకునాల వీరభద్రస్వామి దేవాలయ భూముల్లో అక్రమంగా చేపడుతున్న మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

➡ నిబంధనలకు విరుద్ధంగా సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్స్‌లో పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ పీవైఎల్ జిల్లా కన్వీనర్ రమేష్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.

63 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు

సోమవారం మండల కార్యాలయాల్లో జరిగిన స్పందనకు సకాలంలో హాజరుకాని అధికారులపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా 63 మంది మండల స్థాయి అధికారులు ఉదయం 10.30 గంటలు దాటినా కార్యాలయాలకు రాకపోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. వారందరికీ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఎందుకు ఆలస్యంగా వచ్చారో వారం రోజుల్లో సమాధానం చెప్పాలని అందులో పేర్కొన్నారు. షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో 13 మంది ఏపీఎంలు, ఆరుగురు సీడీపీఓలు, ఆరుగురు ఎంపీడీఓలు, ఎనిమిది మంది ఎంఈఓలు, ఐదుగురు మండల వ్యవసాయాధికారులు, ఎనిమిది మంది పీఆర్ ఇంజినీర్లు, పది మంది ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఏడుగురు హౌసింగ్ ఏఈలు ఉన్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ ఉద్యోగుల జాబితాలను సోమవారం సాయంత్రంలోపు డీఆర్వోకు అందజేయాలన్నారు. స్వాతంత్య్ర సమరయోధులను సన్మానించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఆర్డీఓ హరిప్రసాదు, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వైభవంగా ఖాదర్‌లింగ స్వామి జయంతి వేడుకలు

కొతాళం: జగద్గురు ఖాదర్ లింగ స్వామి జయంతి వేడుకలు సోమవారం కొతాళంలో ఘనంగా జరిగాయి. హిందూముస్లింలు సమైక్యంగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. ధర్మకర్త మున్నా పాషా ఆధ్వర్యంలో ఫాతేహాలు నిర్వహించి, ప్రార్థనలు జరిపారు. సాయంత్రం ఖాదర్‌లింగ స్వామి చిత్ర పటాన్ని లింగాయతీ వంశస్తులు పురవీధుల గుండా ఊరేగించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై. ప్రదీప్ కుమార్ రెడ్డి , వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అత్రితనయ గౌడా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాట్ల కృష్ణమ రాజు, సర్పంచ్ పాల్‌దినాకర్ తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ఫాతేహాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఫిబ్రవరి 11న జాతీయ లోక్‌అదాలత్

కర్నూలు(లీగల్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 11వ తేదీన నంద్యాల, కర్నూలు జిల్లాల్లో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారం జరగాలంటే మొదటగా కక్షిదారులు పరస్పరం కూర్చొని మాట్లాడుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారం జరిగితే కక్షిదారులిద్దరూ గెలిచినట్లేనని భావిస్తారని పేర్కొన్నారు. గతంలో ప్రతిరోజూ లోక్ అదాలత్‌ను నిర్వహించేవారని, ప్రస్తుతం సంవత్సరంలో చేపట్టే జాతీయ లోక్‌అదాలత్‌లతో పాటు ప్రత్యేకంగా కొన్నిసార్లు చేపట్టే లోక్‌అదాలత్‌లలో మాత్రమే కేసులు పరిష్కారం చేస్తారన్నారు. ఫిబ్రవరి 11వ తేదీన రాజీ కాగల అన్ని రకాల కేసులు పరిష్కారం చేస్తారన్నారు. మార్చి నెలలో చేపట్టే లోక్‌అదాలత్‌లో రెవెన్యూ, సెప్టెంబర్‌లో రోడ్డు ప్రమాద కేసులు పరిష్కారం చేస్తామన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సహకారంతో వీలైనన్ని కేసులు పరిష్కారం కోసం కార్యాచరణ చేపట్టినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వి.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జిల్లా జడ్జి శ్రీనివాసరావు

గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన సచివాలయాలతో పేదలకు నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని అల్లాబకాష్ దర్గా సమీపంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి గ్రామంలో ఆర్బీకేలు, హెల్త్ క్లీనిక్‌లు, బల్క్ మిల్క్ సెంటర్లు నిర్మిస్తున్నామన్నారు. సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేసి ప్రజా సమస్యలను పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. అనంతరం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల్లో 60 రోజుల డ్రోన్ పైలెట్ శిక్షణ పూర్తి చేసుకున్న యువకులకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తూ నియామక పత్రాలను మంత్రి బుగ్గన అందజేశారు. ఇప్పటి వరకు రెండు బ్యాచులు శిక్షణ పూర్తి చేసుకున్నారని అందరికీ రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు ట్రైనర్లు వెంకటేశ్వర్ రెడ్డి, సుల్తాన్ తెలిపారు. అలాగే వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించడంతో డైరెక్టర్ మురళీ కృష్ణ, గ్రామ సచివాలయ మండల, పట్టణ కన్వీనర్లుగా ఎన్నికైన తిరుమలేశ్వర్‌రెడ్డి, అజామ్‌లు మంత్రి బుగ్గనను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరెడ్డి, ఎంపీడీఓ వెంగన్న, ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు మూర్తుజా వలీ, మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి, మద్దిలేటిస్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, బాబుల్ రెడ్డి, ఖాజా, భాస్కర్‌రెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్ల పట్టణంలో 3వ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన

క్లుప్తంగా

జిల్లా జైలు తనిఖీ



మాట్లాడుతున్న జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): పంచలింగాలలోని జిల్లా జైలును, మహిళా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకట నాగ శ్రీనివాసరావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్‌కు సంబంధించిన చీఫ్, డిప్యూటీ, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్స్ సోమవారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్నటువంటి ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. 65 ఏళ్ల వయస్సు పైబడిన ఖైదీల వివరాలు సేకరించారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్‌ఈ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ ఎస్‌ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల వినియోగదారులు 7382614308 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు.

బేతంచెర్ల పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదుకు కోర్టు ఆదేశం

కర్నూలు(లీగల్):గిరిజన మహిళపై దాడి చేసిన ఘటనలో బేతంచెర్ల పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదుకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మెగావత్ పెద్దక్క బాయి అనే గిరిజన మహిళ బుగ్గానిపల్లె తండాలో ప్రధాన రహదారి పక్కన టీకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తోంది. జనవరి 10వ తేదీ ఉదయం 4 గంటల సమయంలో బేతంచెర్ల ఎస్‌ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ జనార్దన్, హోం గార్డు అశోక్ టీకొట్టు వద్దకెళ్లారు. నాటుసారా విక్రయిస్తుందనే ఆరోపణతో పెద్దక్కబాయిని బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పైపుతో కొట్టారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొనగా కేసును విచారించిన న్యాయమూర్తి వారిపై కేసు నమోదుకు ఆదేశాలు జారీ చేశారు.



తుంగా తీరం.. మనోహర దృశ్య కావ్యం


గలగల పారే నీటి శబ్దాలు.. కిలకిల రావాలు.. భానోదయాన కర్నూలు సమీపంలోని తుంగభద్ర నదీ తీరం సరికొత్త అందాలు అద్దుకుంటోంది. తోకలు తిప్పుకుంటూ వయ్యారంగా కదిలే చేపలు.. రివ్వున ఎగురుతూ ఒడుపుగా చేపలు పట్టుకునే నల్లని కొంగలు.. నదిలో భారతదేశ పటాన్ని చూపిస్తూ కనిపిస్తున్న భూమి.. ఇలా ఎన్నో మనోహర దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ విహంగాలు జీవన సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు





నదిలో నీరు తగ్గడంతో భారత దేశ చిత్ర పటంలా..



పుసులూరు పొలాల్లో ఫ్లెమింగో పక్షి

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం పుసులూరు గ్రామ పొలాల్లో సోమవారం గ్రేటర్ ఫ్లెమింగో పక్షి ప్రత్యక్షమైంది. రెక్కకు గాయం కావడంతో అక్కడే పడిపోయి ఉంది. గమనించిన గ్రామానికి చెందిన దస్తగిరి దానిని తీసుకుని గ్రామ పెద్ద మహబూబ్‌బాషా వద్దకు వెళ్లారు. పక్షికి సపర్యలు చేసి ఫారెస్ట్ సిబ్బంది లక్ష్మీదేవికి అప్పగించారు. గ్రేటర్ ఫ్లెమింగో పక్షులు విదేశాల నుంచి వేల కిలో మీటర్లు ప్రయాణం చేసి శీతాకాలంలో మన దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వచ్చి గుడ్లు పెడుతుంటాయి. దారి తప్పి ఈ పక్షి ఇక్కడికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే సురక్షితంగా గమ్యానికి చేరుకోవచ్చని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా సోమవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో కోడుమూరు రోడ్డులోని లారీ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీటీసీ శ్రీధర్‌తో పాటు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించి వాహనాలు నడపాలన్నారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎమ్మెల్యే సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజలు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోతే ఎంవీఐ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని డీటీసీ శ్రీధర్ హెచ్చరించారు. అమీలియో హాస్పిటల్ డాక్టర్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ రమేష్, ఎంవీఐలు, ఆర్‌టీఏ కానిస్టేబుళ్లు, హోంగార్డులు, లారీ, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల నిఘా

- 21 మంది మైనర్లకు రూ.32,235 జరిమానా



పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ

కర్నూలు: నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మైనర్లు వాహనాలు తోలుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారని స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాజ్‌విహార్ సెంటర్‌లో ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 21 మంది మైనర్లపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ. 32,235 జరిమానా విధించారు. అనంతరం కర్నూలు నగరంలోని కొత్తపేట దగ్గర ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. భవిష్యత్తులో మైనర్లకు వాహనాలు అప్పగించమని వారితో ప్రతిజ్ఞ చేయించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

- శుభారంభం చేసిన కర్నూలు జట్టు



తలపడుతున్న నెల్లూరు, కర్నూలు జిల్లా జట్లు

కర్నూలు(టౌన్): రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17 వాలీబాల్ పోటీలు సోమవారం ఏ. క్యాంపులోని మాంటిస్సోరి పాఠశాల క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత రాజశేఖర్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షులు రామచంద్రారెడ్డి, ఒలింపిక్ సంఘం సభ్యులు రామాంజనేయులు పోటీలను ప్రారంభించారు. నాకౌట్ పద్ధతిలో పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీల సంఘం ప్రతినిధులు సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, విజయకుమార్, పరిశీలకులు బంగారు రాజు పాల్గొన్నారు.

జిల్లా జట్టు ముందంజ

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టు ముందంజలో నిలిచింది. బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించింది. విజయనగరం జట్టుపై విశాఖపట్నం జట్టు 25-17, 25-14 స్కోర్ తేడాతో గెలిచింది. శ్రీకాకుళం జట్టుపై పశ్చిమగోదావరి జట్టు 27-25, 25-22 స్కోర్ చేసింది. ప్రకాశం జట్టుపై చిత్తూరు జట్టు 25-21, 25-22 స్కోర్‌తో గెలిచింది. కృష్ణా జిల్లా జట్టు కడప జట్టుపై 27-23. 25-19 స్కోర్‌తో గెలిచింది. విశాఖపట్నం జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు 27-09. 25-16 స్కోర్ తేడాతో రెండో రౌండ్‌కు అర్హత సాధించింది.



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న కర్నూలు జిల్లా బాల బాలికలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

పోలీస్ స్పందనకు 117 ఫిర్యాదులు



స్పందనలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు సమస్యను విన్నవిస్తున్న మహిళ

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 117 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని కర్నూలు శ్రీరామ్ నగర్‌కు చెందిన సుబ్బనాచారి ఫిర్యాదు చేశారు. తాను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు తెలియకుండా భార్య, కూతురు కలసి ఇంటిని అమ్మేశారని, ఈ విషయంపై విచారణ జరిపించి న్యాయం చేయాలని కర్నూలు రెవెన్యూ కాలనీకి చెందిన నారాయణగౌడ్ కోరారు. సంతోష్ నగర్‌లోని తమ స్థలాన్ని దౌర్జన్యంగా గోడలు కట్టి ఒకరు ఆక్రమించుకున్నారని కర్నూలుకు చెందిన కృష్ణయ్య ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆఫీస్‌లో పీఎంజీవై కింద ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలుకు చెందిన ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్‌కు చెందిన ఖలీల్ అహ్మద్, పెద్ద కుమారుడు ఆస్తులు సరిగా పంచుకోనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కల్లూరు ఎస్టేట్‌కు చెందిన దస్తగిరమ్మ ఫిర్యాదు చేశారు. సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన బాదుల్లా

కోవెలకుంట్ల: సౌదరదిన్నె గ్రామానికి చెందిన ఓ యువకుడు అప్పుల బాధ తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన అల్లూరి చిన్నబాదులా (35) అనే యువకుడికి సంజామల మండలం ఆల్వకొండ గ్రామానికి చెందిన రహినాబీ అనే మహిళతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. కొన్నేళ్ల నుంచి 10 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మూడేళ్ల నుంచి పప్పుశనగ, జొన్న పంటలు సాగు చేయగా వాతావరణం అనుకూలించ లేదు. పెట్టుబడుల రూపంలో ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ. 12 లక్షల మేర అప్పు చేశాడు. దిగుబడులు రాక, అప్పుదారుల నుంచి ఒత్తిడి అధికం కావడంతో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వ్యక్తులు చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు అదనపు పౌష్టికాహారం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో రక్తహీనతతో ఉన్న 10 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల లోపు విద్యార్థినులకు అదనపు ఆహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని ప్లానింగ్ సెక్రెటరీ విజయకుమార్ కోరారు. సోమవారం స్థానిక ఓ హోటల్‌లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధించిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లోని బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర సంక్షేమశాఖలకు సంబంధించిన వసతి గృహాలు ఎన్ని ? ఆయా వసతి గృహాల్లో ఎంత మంది విద్యార్థినులు వసతి పొందుతున్నారు ? వారిలో ఎంత మంది రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నారు ? అనే విషయాలను ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల వసతి గృహాల్లోని విద్యార్థినులకు స్థానిక ఏఎన్ఎంలు పరీక్షలు నిర్వహించగా 1,208 మంది రక్తహీనతతో ఉన్నట్లు గుర్తించినట్లు ఆయా శాఖల అధికారులు తెలిపారు. రక్తహీనతతో ఉన్న విద్యార్థినులకు అదనపు పోషకాహారం, ఐరన్ ఫోలిక్ మాత్రలు రెగ్యులర్‌గా అందించాలని ప్లానింగ్ సెక్రెటరీ సూచించారు. ఫిబ్రవరి నెలలో మరోసారి పరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సీపీఓ అప్పలకొండ, ఆయా శాఖలకు చెందిన సాధికారత అధికారులు ఎస్‌పీఎస్ఎస్ రెడ్డి, పీ వెంకటలక్షుమ్మ, శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

కాటేసిన కరెంట్



మృతి చెందిన శంకర్ గౌడ్

పగిడ్యాల: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృత్యువాత పడిన సంఘటన నెహ్రూనగర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు శంకర్‌గౌడ్(42)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం ఉదయం కుళాయిలకు నీళ్లు రాగా మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే భర్త మృతి చెందడం చూసిన భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగార్జున కేసు నమోదు చేసి మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

రేపు సీ.క్యాంపు రైతు బజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు రైతు బజారుకు ఈ నెల 25న సెలవు ప్రకటించినట్లుగా ఎస్టేట్ అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ తెలిపారు. రైతు బజారులో క్లీనింగ్, శానిటైజ్ కార్యక్రమాలు చేపట్టేందుకు దానిని మూసివేస్తున్నట్లు సోమవారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. కరోనా వైరస్ మొదలైనప్పటి నుంచి క్లీనింగ్, శానిటైజ్ కోసం నెలలో ఒక్కరోజు రైతు బబజారుకు సెలవు ఇస్తున్నట్లు తెలిపారు.

కేవీఆర్ కాలేజీలో నేడు జాబ్ మేళా

కర్నూలు సిటీ: స్థానిక కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలోని జవహర్‌లాల్ నెహ్రూ నాలెడ్జ్ సెంటర్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం)జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిరాశాంతి తెలిపారు. ఆసక్తిగల వారు ధ్రువీకరణ పత్రాలతో మేళాకు హాజరుకావాల ని సోమవారం ఓ ప్రకటనలో సూచించారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం(రూ)	గరిష్టం (రూ)
వేరుశెనగ	4398	8300
పొద్దుతిరుగుడు	5259	5372
ఆముదం	5009	6441
ఉల్లి	1007	1511
ఎండు మిర్చీ	7199	34999
శనగలు	2510	4609
కందులు	2010	7119
మొక్కజొన్న	1907	2157
మినుములు	6019	6719
సోయా చిక్కుడు	4289	5049

